ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 24.0



ఆగిరిపల్లిలో జరిగిన ప్రజా వేదికలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు.. చిత్రంలో మంత్రి పార్థసారథి, ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు



గేదెలకు పచ్చగడ్డి వేస్తున్న సీఎం



కర్రతో కుండల తయారీ చక్రం తిప్పుతూ.. వారితో మాట్లాడుతున్న సీఎం



బార్బర్ షాపులో కూర్చుని.. వారి కష్టాలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

బీసీలకు ప్రాధాన్యం

ఆగిరిపల్లి పీ 4 సభలో సీఎం చంద్రబాబు నాయుడు

- ఇతర వర్గాలను పైకి తీసుకొస్తాం
- త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతలు పూర్తి
- నూజివీడు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- బలహీన వర్గాల కుటుంబాలతో మమేకం

ఆగిరిపల్లి/ఏలూరు/నూజివీడు/టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):'బీసీలే టీడీపీకి వెన్నెముక.. వారికే అధిక ప్రాధాన్యం. ఇతర వర్గాలనూ అదే తరహాలో పీ-4 విధానంలో పైకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తా. నేను ఓట్ల కోసం మీ దగ్గరకు రాలేదు. చరిత్రలో శాశ్వతంగా మంచి చేశానన్న పేరు కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నా. ఇందులో పారిశ్రామిక వేత్తలను భాగస్వామ్యం చేయడమే నా లక్ష్యం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో శుక్రవారం ఆయన పర్యటించి, పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మార్కెట్‌యార్డులో జరిగిన ప్రజావేదిక వద్ద జరిగిన బహిరంగ సభలో నూజివీడుపై వరాల జల్లు కురిపించారు. తొలుత సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే 198వ జయంత్యుత్సవం సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ 'సంఘ సంస్కర్తగా జ్యోతి బాపూలే, సావిత్రి బాయి దంపతులు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అవిరళ కృషి చేశారు. వారు 200 సంవత్సరాలకు పైబడి ప్రజల్లో గుండెల్లో నిలిచిపోయారు. ఆ తరహా మీకు మంచి చేయడానికి నేనెప్పుడూ ఆలోచిస్తా. చరిత్రలో బీసీలకు మేలు చేసిన తొలి వ్యక్తి ఎన్టీఆర్. బీసీలను ఆదరించే బాధ్యతను నాతోపాటు డిప్యూటీ సీఎం పవన్, ప్రధాని మోదీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టాం. బీసీలకు ఆదా యం పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలను ఈ ప్రభుత్వం రూపొందించింది. ఆగిరిపల్లి అభివృద్ధికి నాలుగేళ్లలో చర్యలు తీసుకుని ఓటు అడగడానికి వస్తా. ఇక్కడ 206 కుటుంబాలను పీ-4 కింద గుర్తించాం. వీరిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కావాల్సిన ఆర్థిక, అంగ బలాలను సమకూర్చడానికి ప్రభుత్వంతోపాటు ఈ ప్రాంతానికి చెందిన పారిశ్రామిక వేత్తల సహాయ సహకారాలను తీసుకుంటున్నాం' అని సీఎం వివరించారు. వేదికపై ఎంపికైన బంగారు కుటుంబాలకు చెందిన పలువురితో సీఎం ముఖాముఖి మాట్లాడి, వారి స్థితిగతులను అడిగి తెలుసుకుంటున్నారు.



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



సీఎంకు మేక పిల్లను బహూకరించిన పెంపకం దారులు

కష్టంగా పిల్లల చదువులు : ప్యారీ రేష్మ

నేను డ్వాక్రా సభ్యురాలిని. నా భర్త డ్రైవర్‌గా పనిచేస్తారు. సొంతిల్లు లేదు. పాప ఇంటర్, ఇద్దరు అబ్బాయిలు 9, 7వ తరగతులు చదువుతున్నారు. వీరి చదువుకు ఇబ్బందులు పడుతున్నాం. సొంతిల్లు కట్టించి, జీవనోపాధికి మార్గం చూపించండి.

భారంగా జీవనం : బోణం లక్ష్మీదుర్గ

నా భర్త బోస్‌మారేతో మూడేళ్ల క్రితం చనిపోయారు. మా అమ్మ ఇంట్లో ఉంటున్నా. పాప యూకేజీ, బాబు అంగన్‌వాడీకి వెళుతున్నాడు. నాకు వితంతు పింఛను రావడం లేదు. మా మామయ్యకు పింఛన్ రావడం వల్ల మ్యాపింగ్ కాకపోవడంతో నాకు మంజూరు కాలేదు. నాకు జీవనోపాధికి మార్గం చూపించండి.

సీఎం : రేష్మకు సొంతిల్లు కట్టించే బాధ్యతను కలెక్టర్ వెట్రిసెల్వి తీసుకుంటారు. లక్ష్మీదుర్గకు ఈ నెల నుంచే పెన్షన్ ఇవ్వండి అంటూ వేదికపై నుంచి కలెక్టర్‌ను ఆదేశించారు. ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాకారమైందని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, ఎస్.సవిత అన్నారు. ప్రజావేదికలో వారు (మిగతా 8వ పేజీలో)

మీ పని తీరు సంతృప్తికరం : కార్యకర్తలతో సీఎం

'నూజివీడు నియోజకవర్గంలో మీ ఎమ్మెల్యే, మంత్రి అయిన పార్థసారధితోపాటు కార్యకర్తల పనితీరు సంతృప్తికరంగా ఉంది. కాని, కొందరు మరింత మెరుగు పరుచుకోవాలి' అంటూ టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. ఆగిరిపల్లిలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలకు, నియోజకవర్గ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగ్గర నుంచి క్లస్టర్ ఇన్‌చార్జిల పనితీరుపై పూర్తి సమాచారం తమ వద్ద ఉందని, వాటి మేరకే స్థానిక పదవులు కేటాయింపు జరుగుతుందని స్పష్టంచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో నాలుగుసార్లు విజయం సాధించాం. కోటగిరి హనుమంతరావు కార్యకర్తలు, ప్రజలతో మమేకమవడం వలనే అనేకసార్లు గెలుపొందారు. మాజీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వ్యవహారాన్ని పార్టీ చూసుకుంటుంది. మహిళలకు స్థానిక పదవుల విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలి. పార్టీ కార్యకర్తల పనితీరుకు ర్యాంకులను ఆయన ప్రకటించారు. ముసునూరు మండలం ఏ-గ్రేడ్‌లో ఉండగా, నూజివీడు రూరల్, నూజివీడు టౌన్‌లు బీ-గ్రేడ్, ఆగిరిపల్లి, చాట్రాయి సీ-గ్రేడ్‌లో ఉన్నాయని ప్రకటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ బూత్ కన్వీనర్లు వారి పరిధిలోని లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అందేలా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ గన్ని వీరాంజనేయులు, మంత్రి పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, నియోజకవర్గ నాయకులు దేవినేని ఢలారాం, మల్లిశెట్టి జగదీష్, ముసునూరు రాజా, చిట్నేని శివరామకృష్ణ, పామర్తి నర్సయ్య, బొట్టు వరలక్ష్మి, ఆరేపల్లి శ్రీనివాస్, బసవారెడ్డి, మరీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం.. ప్రజలతో మమేకం

సీఎం చంద్రబాబునాయుడు ప్రజలతో మమేకమయ్యారు. ఉదయం పదిన్నర గంటలకు ఆగిరిపల్లి మండలం వడ్లమాను హెలీప్యాడ్‌కు చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. అక్కడి నుంచి ఆగిరిపల్లి చేరుకున్న సీఎం బీసీ వర్గీయులను కలిశారు. నాయీ బ్రాహ్మణుడు బత్తుల జగన్నాథం, గొర్రెల కాపరి కోటయ్య, శివయ్యల దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో కాసేపు గడిపారు. పిల్లలతో ముచ్చటించారు. మేకలు, గొర్రెలను ఎత్తుకు న్నారు. పశువులకు పచ్చగడ్డి వేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తమ ఇంటికి వచ్చి యోగ క్షేమాలు తెలుసుకోవడంపై ఆయా కుటుంబాలు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. సీఎం తమ ఆతిథ్యం తీసుకోవడం జీవితంలో మరిచిపోలేమని వారు చెప్పారు. ఒక ముఖ్యమంత్రి నేరుగా ఇలా ప్రజల వద్దకే వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకోవడం ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు.

నూజివీడుకు వరాల జల్లు

సీఎం చంద్రబాబు నూజివీడు నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. 'చింతలపూడి ఎత్తిపోతల పథకం కోర్టు వివాదాన్ని పరిష్కరించి అతిత్వరలో పూర్తి చేస్తాం. చెరువులను గొలుసుకట్టు చెరువులుగా మార్చి సాగునీటితో నింపేలా చర్యలు చేపడతాం. ఆగిరిపల్లి మండలం నుంచి ఔటర్ రింగురోడ్డు వెళుతుండడంతో నియోజకవర్గం అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. నూజివీడుకు రింగు రోడ్డు వేస్తాం. ఆగిరిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం, పక్కా డ్రెయినేజీ వ్యవస్థను నాలుగేళ్లలో పూర్తిచేస్తాం. అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తాం. గ్రామంలో సొంతిళ్లు లేని వారిని గుర్తించి స్థలాలు ఇచ్చి గృహాలను నిర్మించేలా చర్యలు చేపడతాం' అని సీఎం హామీ ఇచ్చారు. ఇళ్ల సమస్య పరిష్కారానికి కలెక్టర్ కె.వెట్రిసెల్విని ఆదేశించారు.



బాబుకు వీరతిలకం



- **అనాథలను చదివిస్తా**

హీల్ అనే పాఠశాల ద్వారా వెయ్యి మంది అనాథ విద్యార్థులకు విద్యను అందిస్తున్నాం. వివిధ ప్రాంతాల్లోని అనాథలను గుర్తించి వారికి చదువు చెబుతాం.
- ధనప్రకాశ్, మోడల్ డెయిరీ డైరెక్టర్

- **300 మంది విద్యార్థులకు ఉచిత విద్య**

నేను స్థాపించిన హ్యాపీ వ్యాలీ స్కూల్‌ను మీరే ప్రారం భించారు. ఈ స్కూల్ కోసం చేసిన రూ.వంద కోట్ల అప్పు తీర్చాను. 300 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నా. వారు మంచి జీవితాన్ని ప్రారంభించే వరకు బాధ్యత తీసుకుంటా.
- గౌతమ్, ఆగిరిపల్లి హ్యాపీవ్యాలీ స్కూల్ అధినేత

- **మట్టిలో ఆణిముత్యాలను వెలికితీస్తా**

పీ 4 కార్యక్రమం ద్వారా మట్టిలో ఆణిముత్యాలను వెలికి తీసే బాధ్యత తీసుకుంటా. నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ నుంచి పలువురికి ఉద్యోగాలు కల్పిస్తా.
- నితిన్ కృష్ణ, మంత్రి పార్థసారథి తనయుడు

- **కుటుంబాలను దత్తత తీసుకుంటా**

మీ కార్యక్రమాలే నా ఎదుగుదలకు స్ఫూర్తి. 60మందితో ప్రారంభమైన మా కాలేజీలో ఇప్పుడు ఆరు వేలమంది మూడు బ్రాంచిల్లో చదువుతున్నారు. ఎక్కువ మంది కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ప్రయత్నిస్తా.
- రావి వెంకట్రావు, ఎన్ఆర్ఐ కాలేజెస్ చైర్మన్

సీఎం ఏ సమయానికి ఎక్కడ ?

- 10.30కి హెలిప్యాడ్ వద్దకు రావాల్సిన సీఎం చంద్రబాబు హెలికాప్టర్ 10.45కు చేరుకుంది.
- 10.52కు ముఖ్యనాయకులతో మాట్లాడి బీసీ సామాజిక వర్గీయులతో మమేకమయ్యేందుకు ఆగిరిపల్లి పయనం.
- 10.59కు నాయీ బ్రాహ్మణుడు బత్తుల జగన్నాథం, గొర్రెల కాపరి నక్కనబోయిన కోటయ్య స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.
- 11.45కు ప్రజావేదిక సభకు హాజరు.
- 12.30కు సీఎంకు కంబళి కప్పి, మేకపిల్లను బహూకరించిన కృష్ణా జిల్లా గొర్రెల పెంపకందారుల అధ్యక్షుడు వెంకటకృష్ణ
- 12.40కు సీఎంకు నూజివీడు రసాలను బహూకరించిన బీజేపీ రాష్ట్ర నాయకురాలు శరణాల మాలతిరాణి
- 1.45కు పీ4 మార్గదర్శులకు సన్మానం
- 2.25కు టీడీపీ క్యాడర్‌తో ముగిసిన సమావేశం. హెలికాప్టర్‌లో ఒంటిమిట్టకు పయనం.



ముస్లింలకు సంఘీభావంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చంటి

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింల ర్యాలీ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏలూరులో ముస్లిం సమైక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. తొలుత ర్యాలీ స్థానిక కర్బలా మైదానం నుంచి ప్రారంభమై ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ముస్లింల రాజ్యాంగ హక్కులను కాపాడాలన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. అంజుమన్ అధ్యక్షుడు జబీవుల్లా, రాజ అహ్మద్, ఇలియాస్ పాషా, ఎం.డి.ఇక్బాల్, అనీస్ బాషా, అజ్మల్ బాషా, రియాజ్ ఆలీఖాన్, ముస్లింలు తరలి వచ్చారు. ముస్లింలకు ఎమ్మెల్యే బడేటి చంటి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు సంఘీ భావం తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు.

నేడు పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ఏలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ ఆదేశాల మేరకు ఈ నెల 12న ఏలూరు జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 11 నుంచి 5.30 గంటల వరకు పనిచేస్తాయని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ సెలవు దినమైనా కార్యాలయాలు పనిచేస్తాయని అదనపు రుసుము లేకుండా రిజిస్ట్రేషన్‌లు నిర్వహించుకోవచ్చని తెలిపారు.



కలిదిండి మండలంలో ఉప్పుటేరు పీడబ్ల్యూడీ భూముల్లో అక్రమ చెరువులు

పీడబ్ల్యూడీ భూముల్లో దర్జాగా చేపలు, రొయ్యల చెరువులు

కలిదిండి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తరించి ఉన్న ఉప్పుటేరు, పెదలంక డ్రెయిన్ వెంబడి ఉన్న వందలాది ఎకరాల పీడబ్ల్యూడీ భూములను కొంతమంది బడా బాబులు ఆక్రమించుకుని చేపల, రొయ్యల చెరువులుగా తవ్వడంతో ఉప్పుటేరు, పెదలంక డ్రెయిన్లు ఉనికిని కోల్పోతున్నాయి. ఆకివీడు వంతెన వద్ద నుంచి పెదలంక శివారు మాట్లం వరకు ఉప్పుటేరు ఇరువైపులా సుమారు 2 వేల ఎకరాల భూమి ఆక్రమణల చెరలో ఉంది. ఉప్పుటేరు ఆక్రమణలపై ఇటీవల ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఉప్పుటేరును ప్రక్షాళన చేస్తేనే వరద ముంపును నివారించగల్గుతామని ఉప్పుటేరు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో డ్రెయినేజీ శాఖ అధికారులు ఉప్పుటేరు ఆక్రమణలపై సర్వే చేసి వివరాలు ఇవ్వాలని రెవెన్యూ శాఖను మౌఖికంగా కోరింది. పెదలంక డ్రెయిన్ కృష్ణా జిల్లా కృత్తివెన్ను, బంటుమిల్లి, ఏలూరు జిల్లా కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో విస్తరించి ఉంది. ఈ డ్రెయిన్ వెంబడి భూములు ఆక్రమణకు గురవడంతో సుమారు లక్ష ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. తుఫాను, వరదలు సంభవించనప్పుడు ఈ డ్రెయిన్ ద్వారా సముద్రంలోకి వరద నీరు ప్రవహిస్తుంది. ప్రస్తుతం ఆక్రమణలకు గురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయినేజీ అధికారులు అక్రమ చెరువులను తొలగించినప్పటికీ మళ్లీ వాటిని తవ్వి చేపల, రొయ్యల సాగు చేస్తున్నారు. పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఉప్పుటేరు, పెదలంక డ్రెయిన్ వెంబడి ఉన్న పీడబ్ల్యూడీ భూముల ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

నేడు ఇంటర్ ఫలితాలు

లోపలి పేజీలో..

95523 00009 వాట్సాప్ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే సబ్జెక్టుల వారీగా మార్కుల వెల్లడి



ఉండి మండలం చిలుకూరులో ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం



సీసలిలో ఇంజన్‌తో చేలో నీటిని బయటకు తోడుతున్న దృశ్యం

చివరిలో టెన్షన్

అకాల వర్షాలతో అన్నదాతల్లో ఆందోళన

ఆరబెట్టిన ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు

గాలులకు నేలవాలిన పంట..చేలల్లోకి వర్షపు నీరు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షంతో రైతులు డీలా పడ్డారు. కోసిన పంట కాపాడుకునేందుకు పొలాల వెంట పరుగులు తీశారు. కొన్ని ప్రాంతాల్లో హడావుడిగా మాసూళ్లు చేపట్టారు.

ఆకివీడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలంలో కోతలు ప్రారంభ దశలోనే ఉండగా నాలుగైదు రోజుల నుంచి వాతావరణం మార్పులతో రైతులు పొలాల్లో పడిగాపులు పడుతున్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం అక్కడక్కడ తడిశాయి. వరిచేలల్లో నీరు చేరింది. నీరు బయటకు వెళ్లాలంటే వారం రోజులు పడుతుందని రైతులు కలత చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేలు పైబడి పెట్టుబడి పెట్టామని వర్షంతో మరో రూ.5వేలు అదనపు ఖర్చు అవుతుందంటున్నారు.

వర్షంతో చేలల్లోకి కోత మిషన్లు దిగవు



అకాల వర్షంతో వరిచేలలోకి నీరు చేరడంతో వారం రోజులు వరకూ కోత మిషన్లు దిగవు. పంట చివరి దశలో ప్రకృతి కన్నెరతో అదనపు ఖర్చు తప్పడం లేదు. పంట, మురుగు కాల్వలు శాశ్వత ప్రక్షాళన చేయకపోవడంతో పొలాలు ముంపుబారిన పడి నష్టపోతున్నారు.

కొండ , కౌలురైతు, ఆకివీడు

• పంట ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు

ఉండి : గురువారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో వరిచేలు ఒరిగాయి. పాందువ్వ, ఆరేడు, ఉప్పులూరు, యండ గండి, చిలుకూరు, ఉండి తదితర గ్రామాలలో పంట కోత పనులను చేపట్టారు. ఒబ్బిడి చేసిన ధాన్యం తడవకుండా వాటిపై బరకాలను కప్పి పంటను దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. వాతావరణం అనుకూలించాలని రైతులంతా కోరుతున్నారు.

• రైతులు పొలాల బాట

కాళ్ళ : గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో రైతులు పండించిన పంటను కాపాడుకునేందుకు పొలాలబాట పట్టారు. మండలంలోని కాళ్ళ, సీసలి, జక్కరం, కోపల్లె, కోమటిగుంట తదితర గ్రామాల్లో వరిపంటను కోతమిషన్ల సాయంతో కోసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కల్లాల్లోని ధాన్యాన్ని పట్టుబడి పట్టడంతోపాటు రోడ్డు మార్జిన్‌ల వెంబడి ఆరబెట్టుకుంటున్నారు. సీసలి గ్రామంలో ఇంకా కోతలు కోయని వరిచేలల్లో నీరు చేరింది. ఆయిల్ ఇంజన్ల సహాయంతో నీటిని బయటకు తోడుకుంటున్నారు.

• పది రోజులు అనుకూలిస్తే గట్టెక్కుతాం

మొగల్తూరు : మొగల్తూరు మండలంలోని రామన్నపాలెం, కేపీ పాలెం, మొగల్తూరు, శేరేపాలెం గ్రామాల్లో సుమారు 1,141 ఎకరాల్లో సాగు చేపట్టారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో రెండు సార్లు వేసుకున్న ఆకుమడులు, నాట్లు వేసిన చేలు ముంపనకు గురవడంతో దాళ్వా సాగు జనవరి నెలాఖరు వరకూ నాట్లు వేస్తూనే ఉన్నారు. అయితే ముందుగా ఊడ్చిన చేలు కోతకు రావడంతో సుమారు 50 ఎకరాల వరకూ కోసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. రెండు, మూడు రోజులుగా కోసిన పనలను చేలో ఆరబెట్టారు. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లో ఆరబెట్టిన పనలు తడిసి పోయాయి. మరో 10 రోజుల పాటు వాతావరణం అనుకూలించి వర్షాలు కురవకుండా ఉంటే గట్టెక్కుతామని రైతులు అంటున్నారు.

• దేవుడా.. నువ్వే రక్షించాలి..

గణపవరం : పంట పుష్కలంగా పండిందనుకుంటున్న తరుణంలో ఈదురుగాలులు, అకాల వర్షాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. మండలంలో దాళ్వాకోతలు 20 శాతం పూర్తయ్యాయి. రెండు రోజులుగా ఈదురుగాలులు, అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. పంట చేతికి వస్తున్న తరుణంలో ఈ వాతావరణం రైతులకు ఆశని పాతంలా తగులుకుంది. మండలంలో 6,150 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. పంట ఆశాజనకంగా ఉంది. కోతలు ప్రారంభించారు. మరోక నాలుగురోజుల్లో మరింత ముమ్మరంగా మాసూళ్ళు జరిగే అవకాశాలున్నాయి.ఎకరానికి 50 -55 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. వాతావారణం నుంచి గట్టెక్కించాలని రైతులు భగవంతునిపై భారం వేసి దాళ్వా మాసూళ్లకు ఉపక్రమిస్తున్నారు.

• పెద్దగా నష్టం లేదు : ఏవో

భీమడోలు / ఉంగుటూరు : గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని వరి సాగు రైతులు బెంబేలెత్తిపోయారు. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి అక్కడక్కడ రోడ్లపై, పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పెద్దగా నష్టం లేదని రైతులు, అధికారులు తెలిపారు. మండలంలో ఆరబెట్టిన ధాన్యానికి పెద్దగా నష్టం వాటిల్లలేదని, వర్షానికి స్వల్పంగా తడిచిన ధాన్యం శుక్ర వారం ఎండలకు ఆరిపోవడంతో పెద్దగా ఇబ్బందికర పరిస్థితులు లేవని అయినప్పటికీ దీనిపై ప్రాథమిక అంచనాలను తయారు చేస్తున్నామని ఏవో ఉషారాణి తెలిపారు.ఉంగుటూరు మండలంలో దాళ్వా చేలు కోతకు వచ్చాయి.పంట కోతకు వచ్చిన సమయంలో వాతావరణం ఇబ్బందులు పెడుతోంది. దీంతో రైతులు హడావుడిగా మాసూళ్లు చేస్తున్నారు.

ఏలూరు జిల్లాలో 11 వేల ఎకరాల్లో మాసూళ్లు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆరబెట్టిన ధాన్యం తడిసి పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గాలులకు వరి చేలు నేలకొరుగుతున్నాయి. ఆరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకోవటానికి ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్నా గాలులకు ఎగిరిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. సడెన్‌గా కురుస్తున్న వర్షాలకు ధాన్యాన్ని రక్షించుకోవటం కష్టతరంగా తయారైందంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 15 శాతం మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయి. ఈ ఏడాది 78 వేల 847 ఎకరాల్లో రబీ సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 11 వేల 97 ఎకరాల్లో మాత్రమే అంటే 15 శాతం మాత్రమే వరి మాసూళ్లు పూర్తయ్యాయి.ఉంగుటూరు, భీమడోలు, పెదపాడు, దెందులూరు, నిడమర్రు, ద్వారకాతిరుమల మండలాల్లో మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు ఇతర పంటలకూ నష్టాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యాన పంటలకు, మిరప పంటకు నష్టాలు తెచ్చి పెడుతున్నాయి. ఈదురుగాలులకు మామిడి తోటల్లో కాయలు పూర్తిగా రాలిపోయాయని, అసలే ధర లేని సమయంలో కాయలు రాలిపోవడంతో నష్టపోయామని మామిడి రైతులు చెబుతున్నారు.



గణపవరంలో హడావుడిగా మాసూళ్ల..



ఉంగుటూరు మండలం కైకరం జాతీయ రహదారి పక్కన ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు



భీమడోలులో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు



కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు




ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం





సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

నేటి నుంచి రాట్నాలమ్మ తిరునాళ్లు

పెదవేగి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ తిరునాళ్ల 12వ తేదీ శనివారం నుంచి 16వ బుధవారం వరకు ఐదురోజుల పాటు జరుగుతాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం ఉత్సవాలను ప్రారంభిస్తారని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.శనివారం తెల్లవారుజామున 4.38 గంటలకు ఉత్సవ కమిటీ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, శివపార్వతి దంపతుల కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. తెల్లవారుజామున 4.38 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, అఖండ జ్యోతి ప్రజ్వలన, దీక్షాధారణ, అష్టదిక్పాలక సహిత నవగ్రహ మండపారాధన, కలశస్థాపన పరివార దేవతార్చన. అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వ హిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు రామ లింగేశ్వరస్వామికి అష్టోత్తర శతక కలశాభిషేకం, హనుమాన్ చాలీసా, సాయంత్రం 6గంటలకు అమ్మవారికి



కుంకుమార్చన జరుగుతాయని చెప్పారు. తొలి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిస్తారు.

అండర్-19, 23 క్రికెట్ జట్టు ఎంపికలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాలలోని క్రీడా మైదానంలో ఏసీఏ అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అండర్-23, అండర్-19 పురు షుల జట్టు ఎంపిక పోటీలు నిర్వహి స్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 17న సీనియర్ జట్టు, 18న అండర్-19 జట్టు ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్-23 విభాగంలో 2002వ సంవత్సరం సెప్టెంబర్ ఒకటవ తేదీ తరువాత జన్మించి ఉండాలన్నారు. అండర్-19కి సంబంధించి 2006వ సంవత్సరం సెప్టెంబర్ ఒకటవ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. తెలిపిన తేదీల్లో ఉదయం 10 గంటలకు పుట్టిన తేదీ ఒరిజినల్ ధృవపత్రాలు, జిరాక్స్ కాపీలు, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని కార్యదర్శి శ్రీనివాసరాజు తెలిపారు.



ఆక్వా సమస్యలపై మంత్రులు రామానాయుడు, శ్రీనివాసవర్మలకు వినతిపత్రాలను అందజేస్తున్న ఆక్వా సంఘం చైర్మన్ గాంధీభగవాన్ రాజు తదితరులు

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రులకు వినతి

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు పూలపల్లి ఆయన నివాసానికి శుక్రవారం విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడులకు వినతి పత్రాలను అందజేశారు. పాలకొల్లులో జరిగిన బీజేపీ సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ సమావేశం అనంతరం గాంధీ భగవాన్‌రాజు నివాసానికి వెళ్లారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, హేచరీలు నుంచి ప్రోసెసింగ్ ప్లాంట్లు వరకూ ఆక్వా రైతులను దోపిడీ చేస్తున్నారని వివరించారు. గత 7వ తారీఖున జరిగిన ఆక్వారైతు మహాసభలో రైతులు తీసుకున్న ఆక్వా క్రాప్ హాలిడే అంశాన్ని, త్వరలో ఆక్వా రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధం చేసుకుంటున్న ప్రతిపాదనలను మంత్రులకు వివరించారు. అనంతరం సంఘం సభ్యులతో కలిసి వినతిపత్రాలను అందజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యలు తీసుకువెళతానని మంత్రులు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే అంగర రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

మే 1న గునుపూడిలో భగవద్గీత పోటీలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉమా సోమేశ్వర భగవద్గీత సమాజం 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మే1 తేదీ భగవద్గీత పోటీలను గునుపూడి సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు యామిజాల ఉమా సోమేశ్వరరావు తెలిపారు. 15 నుంచి 16 సంవత్సరాల వారికి 11వ అధ్యా యంలో 1 నుంచి 41 శ్లోకాల వరకు, 16 సంవత్సరాలు పైబడిన వారందరూ పదకొండో అధ్యాయంలో 55 శ్లోకాలు పూర్తిగా చెప్పాలన్నారు. వివరాలకు 94908 33009 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నిషేధం ఇదేనా ?



ద్వారకాతిరుమల క్షేత్రంలో యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

అరికట్టడంలో అధికారులు విఫలం

కలుషితమవుతున్న పర్యావరణం,పరిసరాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల బాధ్యతా రాహిత్యం.. అధికారుల చిత్తశుద్ధి లోపం వెరసి చిన్న తిరుపతిగా ఖ్యాతిగాంచిన ద్వారకాతిరుమల క్షేత్ర పరిధిలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెనుభూతంలా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లపై ప్రభుత్వం 2022 జూలై 1 నుంచి నిషేధం విధించింది. కొన్నాళ్లపాటు కొండపైన, దిగువన కూడా ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేశారు. అధికారులు కూడా తనిఖీలు చేసేవారు.. ఇటీవల ద్వారకాతిరుమల గ్రామంతో పాటు క్షేత్ర పరిసరాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. దాదాపు దశాబ్ధకాలం క్రితమే శ్రీవారి క్షేత్రంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేశారు. దుకాణదారులకు హెచ్చరికలు చేశారు.తనిఖీలు చేసి జరిమానాలు సైతం విధించారు. క్రమేపీ నిబంధనలను తుంగలోకి తొక్కేశారు. ప్రస్తుతం ఏ భక్తుని చేతిలో చూసినా క్యారీ బ్యాగ్ కనిపిస్తోంది. కొండపైన దాదాపు అన్ని దుకాణాల్లోనూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిల్స్, కొండ దిగువన చిరువ్యాపారులు పండ్లు, నిమ్మకాయలు, జామకాయలు వంటి వాటిని ఈ కవర్ల ద్వారానే విక్రయిస్తున్నారు. అటు పంచాయతీ అధికారులు గానీ, ఇటు ఆలయ అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు జిల్లా కేంద్రం నుంచి వచ్చే అధికారులు కొండపై తూతూమంత్రంగా తనిఖీ చేపడతారు. అధికారులు వచ్చిన సమాచారం తెలుసుకున్న దుకాణదారులు కవర్లను దాచేసి వారు వెళ్లిన తర్వాత వినియోగంలోకి తెస్తారు.

తిరుమల తిరుపతిలో పూర్తి నిషేధం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమల తిరుపతిలో దాదాపు రెండేళ్ల క్రితం నుంచే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేశారు. కొండపై ఉన్న దుకాణదారులతో పాటు కొండపైకి వచ్చే భక్తులు సైతం నిషేధం తప్పక పాటించాల్సిందేనని టీటీడీ నిర్ణయించింది. అలిపిరి టోల్‌గేట్ వద్దే ప్లాస్టిక్‌ను గుర్తించే సెన్సార్‌లను ఏర్పాటు చేసి నిఘా పెంచింది. అధికారుల తనిఖీలో ప్లాస్టిక్ కనిపిస్తే ఆ దుకాణాలను సీజ్ చేస్తారు. భక్తులు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను కొండపైకి తీసుకెళ్తుంటే వారిని అడ్డుకుని వారికి గాజుసీసాలలో ఉన్న వాటర్‌ను బాటిల్ రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. దర్శనానంతరం తిరిగి వచ్చే సమయంలో ఆ ఖాళీ గాజు బాటిల్‌ను వారికి ఇచ్చేస్తే తిరిగి రూ.20 ఇస్తారు. మరి ఇక్కడ కూడా అధికారులు పక్కాగా నిషేధం అమలు చేస్తేనే పర్యావరణంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

ప్లాస్టిక్ వల్ల నష్టాలు ఇవీ

- ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, జీవజాలం, మానవ ఆరోగ్యానికి చాలా నష్టాలున్నాయి. ప్లాస్టిక్‌లను సరిగా పారవేయకపోతే డ్రైనేజీలలోకి వెళ్లి నీటి ద్వారా వచ్చే వ్యాధులకు కారణమవుతాయి.
- ప్లాస్టిక్‌లు భూమిలోకి వెళ్లి మట్టిని, నీటిని కలుషితం చేస్తాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రజీవులు తినడం వల్ల వాటి శరీరంలో విషం చేరుతుంది.
- ప్లాస్టిక్ కాలుష్యం వల్ల ఆవాసాలు, సహజ ప్రక్రియలు మారుతున్నాయి. వాతావరణ మార్పులకు అనుగుణంగా పర్యావరణ వ్యవస్థల సామర్థ్యం తగ్గిపోతుంది.
- లక్షలాది మంది ప్రజల జీవనోపాధి, ఆహార ఉత్పత్తి సామర్థ్యాలు, సామాజిక శ్రేయస్సు ప్రత్యక్షంగా ప్రభావితం అవుతున్నాయి.
- ప్లాస్టిక్‌లను తయారు చేయడానికి సెల్యులోజ్, బొగ్గు, సహజవాయువు, ఉప్పు, ముడి చమురు, వంటి సహజ పదార్థాలను వినియోగిస్తారు.

ప్రత్యామ్నాయాలివే

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా సేంద్రియ పత్తి, వెదురు, చెక్క, మట్టి, పింగాణీ, త్వరగా ప్రకృతిలో కలసిపోయే ప్లాస్టిక్‌తో తయారైన వస్తువులు వాడాలి. మట్టి, పింగాణీ పాత్రలను ఆహారం నిల్వ చేసేందుకు వాడొచ్చు.



కొండపై పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



కొండ దిగువన కవర్లతో నిమ్మకాయల అమ్మకాలు



తాడేపల్లిగూడెంలో జరిగిన సమావేశంలో కునాల్ సత్యార్థి

దేశంలో కీలక వనరు భూమి

డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ముఖ్యమైన వనరులలో భూమి చాలా కీలకమని డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరి కునాల్ సత్యార్థి అన్నారు. రాష్ట్రంలో రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న తాడేపల్లిగూడెంలో ప్రజాభిప్రాయ సేకరణకు శుక్రవారం ఐఏఎస్ అధికారి నిరంజన్ కుమార్ సుధాన్షుతో కలసి సత్యార్థి పాల్గొన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యార్థి, సుధాన్షు రీ సర్వే వల్ల ఇబ్బందులు, ప్రయోజనాలపై ఆరా తీశారు. రీ సర్వే, అధికారులకు అందజేసిన డాక్యుమెంట్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పురోగతి పై అధికారులను ఆరా తీశారు. అనంతరం రూరల్ మండలం చినతాడేపల్లి, పెంటపాడు మండలం కె.పెంటపాడులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. మండలంలో కూడా సర్వేపై అధికారుల పనితీరును అడిగి తెలుసు కున్నారు. మండలంలోని మ్యాప్ పరిశీలించి ఇప్పటివరకూ ఎన్ని గ్రామాలలో సర్వే జరిగింది, ఇంకా ఎన్ని గ్రామాల్లో జరగాల్సి ఉంది తెలుసుకున్నారు. చనిపోయినవారి పేర్లతో ఉన్న డాక్యుమెంట్ కలిగిన పొలాలను ఎలా సర్వే చేస్తున్నారు. సర్వే ముందు భూమి ఎలా ఉంది, తరువాత ఎలా ఉంది అనే అంశాలను తెలుసుకున్నారు.

రీ సర్వే సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరి కునాల్ సత్యార్థి, నిరంజన్‌కుమార్ సుధాన్షు ఏపీ నిట్‌లో నిర్వహించిన సమావేశంలో బొలిశెట్టి మాట్లాడారు. రీ సర్వేతో సరిహద్దు గొడవలు తగ్గుతాయన్నారు. రైతులకు మంచి చేద్దామనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రీ సర్వే చేయిస్తున్నారని తెలిపారు.

కార్యక్ర మంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ విద్యుల్లత, సర్వే డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కుమార్, రాజమండ్రి ఆర్డీ బాలస్వామి, ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహసీల్దార్లు సునీల్‌కుమార్, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.



రహదారుల అభివృద్ధి ప్రతిపాదనలను అధికారులకు వివరిస్తున్న సర్పంచ్ పడవల మేరీ

మొగల్తూరు రోడ్లకు రూ.70 కోట్లు

ప్రతిపాదనలు సిద్ధం చేసిన పంచాయతీ పాలకవర్గం

డిప్యూటీ సీఎం ఆదేశాలతో గ్రామంలో పర్యటించిన ఇంజనీర్లు

మొగల్తూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పంచాయతీ పరిధిలో రహదారుల అభివృద్ధికి అడుగు ముందుకు పడింది. పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్, డీఈ డి.సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావు శుక్రవారం గ్రామంలో రహదారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో గత 28న మొగల్తూరులో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ గ్రామాభివృద్ధి సమావేశం నిర్వహించి వినతులు తీసుకున్నారు. తొలి ప్రాధాన్యతగా ఉన్నత పాఠశాలకు రూ.1.71 కోట్లు మంజూరురయ్యాయి. రెండో ప్రాధాన్యతగా రహదారి పక్కన డంప్ చేసిన చెత్తను స్వచ్ఛ ఆంధ్ర టీమ్ సభ్యులతో తరలిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గల పంచాయతీ రాజ్ శాఖ నుంచి చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, గ్రామాల మధ్య రహదారులు, అంగన్‌వాడీ, మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ప్రతిపాదనలు కోరుతూ ఈనెల 8న ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికనుగుణంగా గ్రామంలో రహదారులకు రూ. 70 కోట్లు అంచనాలతో పంచాయతీ రూపొందించిన ప్రతిపాదనలు సర్పంచ్ పడవల మేరీ ఇంజనీరింగ్ అధికారులకు శుక్రవారం అందజేశారు. ఈ ప్రతిపాదనలు మండల పరిషత్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు పంపారు. అక్కడి నుంచి ఉప ముఖ్యమంత్రి పేషీకి వెళ్లనున్నాయి. మొగల్తూరు గ్రామాభివృద్ధికి పవన్ కల్యాణ్ కృషిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు మంచి పోషకాహారం ఇవ్వాలి

అంగన్‌వాడీ, పాఠశాలల్లో ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి తనిఖీ



శృంగవృక్షంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

పాలకోడేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలం శృంగవృక్షం అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లలకు మంచి పోషకాహారం ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లకు సూచించారు. పిల్లలకు పెట్టే ఆహార పదార్థాలు ఏవిధం గా ఉన్నాయని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతే కాకుండా ప్రీ స్కూల్ పిల్లలకు అంగన్‌వాడీ సిబ్బంది నేర్పించే విద్య పద్ధతులు పరిశీలించి మెచ్చుకున్నారు. అంగన్‌వాడీలో స్కూల్ వాతావరణం కూడా ఎంతో బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఆమె వెంట ఆకివీడు సీడీపీవో వాణి విజయరత్నం, అంగన్ వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్‌వాడీలు, ఆయాలు ఉన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పట్టణంలో పలు పాఠశాలలను ఫుడ్ కమిటీ సభ్యురాలు గంజిమాల దేవి సందర్శించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు గుమ్మళ్ళ వీరాస్వామి, ఆర్ఎన్‌వీఎస్ గంగాధరశర్మ ఆమెకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి స్వాగతం పలికారు. పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, స్టాక్ రూములు, ఆహార పదార్థాలు తనిఖీ చేశారు. పాఠశాలల పరి సరాల పరిశుభ్రతను, మధ్యాహ్న భోజనం చేయని విద్యార్థుల వివరాలను, కారణాలను రికార్డు చేసుకున్నారు. విద్యార్థులు పౌష్టికాహారం అందిస్తున్న విషయాలను రికార్డులను పరిశీలిం చారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయి స్తున్నది లేనిది ఆరా తీశారు. ఫుడ్ కమిటీ సభ్యురాలు దేవి వెంట డీఈవో ఈ నారాయణ, ఏడీ సత్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి సరోజాదేవి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్ టి జనార్దన్ ఉన్నారు.

బాలికలకు హైస్కూల్ ప్లస్

ఇంటర్ విద్య కొనసాగింపు.. కోఎడ్యుకేషన్ కళాశాలలు ఎత్తివేత?

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో ఎటువంటి ఏర్పాట్లులేకుండా హడావుడిగా మండలాల్లో జడ్పీ హైస్కూళ్ల తరగతి గదుల్లోనే ఇంటర్ విద్యను బోధించడానికి హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారు. రెండు విడతలుగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లో తొలుత 2022-23 విద్యా సంవత్సరానికి బాలికలకోసం నిర్వహించిన కళాశాలలు కొనసాగించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. 2023-24 సంవత్సరం కోఎడ్యుకేషన్ విధానంలో జిల్లాలో ప్రారంభించిన 9 హైస్కూల్ ప్లస్‌లను ఎత్తివేయాలని దాదాపు నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

> విద్యార్థుల సంఖ్య, ఇంటర్ పరీక్షల్లో ఫలితాలు, మౌలిక సదుపాయాలు, నిర్వహణ పేలవంగా ఉన్నప్పటికీ హైస్కూల్ ప్లస్ (జడ్పీ జూనియర్ కళాశాల)ను కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. బాలికల కళా శాలలు మాత్రం కొనసాగించి, కోఎడ్యుకేషన్ కళాశాలల ఎత్తివేతకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

ఫలితాల్లో అట్టడుగున..

హైస్కూల్ ప్లస్‌లను ఎటువంటి ముందస్తు ప్రణాళిక, ఏర్పాట్లు లేకుండా ప్రారంభించిన వైసీపీ ప్రభుత్వం కనీసం బోధించేందుకు తగిన అర్హతలున్న ఉపాధ్యాయులను నియమించకుండానే తొలి ఏడాది (2022-23) మొక్కుబడిగా ముగించింది. ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌లు ఇంటర్ విద్య బోధించారు. వారు హైస్కూల్ తరగతులు, ఇంటర్మీడియట్ పాఠ్యాంశాలను బోధించాల్సివచ్చేది. విద్యా సంవత్సరం ముగిసేవరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు కూడా అందకపోవడంతో ఫలితాలు ఘోరంగా వచ్చాయి. మరోవైపు విద్యార్థినులు కూడా నిరుత్సాహంతో ప్రైవేటు కళాశాలలవైపు వెళ్లిపోయారు. ప్రతికూల ఫలితాలు రావడంతో వీటిని ఎలాగైనా కొనసాగించాలనే మొండిపట్టుదలతో సంబంధిత జడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యా ర్థులకు టీసీలు ఇవ్వవద్దని, వారందరినీ హైస్కూల్ ప్లస్‌లలో చేర్పాల్సిన బాధ్యతలు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులదేనని గత ప్రభుత్వం ఒత్తిడి తేవడం అప్పట్లో ఉపాధ్యాయవర్గాలు తీవ్ర ఆందో ళనకు గురయ్యాయి.

ఏలూరు జిల్లాలో తొలి బ్యాచ్(2022-24) ఇంటర్ పరీక్షలు రాసిన 323మంది విద్యార్థుల్లో కేవలం 172 మంది (53శాతం) ఉత్తీర్ణులయ్యారు. క్షేత్రస్థాయిలో హైస్కూల్ ప్లస్‌లు ఫెయిలైనప్పటికీ గుణపాఠాలు నేర్వని జగన్ ప్రభుత్వం 2023లో జిల్లాలో మరో 9 హైస్కూల్ ప్లస్ (కోఎడ్యుకేషన్)ను ప్రారంభించినప్పటికీ పాఠ్యాంశాలు బోధించేందుకు టీచరు పోస్టులను మాత్రం ఇవ్వలేదు. దీంతో ఉపయోగకరంగాలేని హైస్కూల్ ప్లస్‌లను ఎత్తివేయాలని ప్రస్తుత ప్రభుత్వం తొలుత యోచించినా, చివరకు బాలికలకోసం ఉద్దేశించిన వాటినిమాత్రం కొనసాగించి, కోఎడ్యుకేషన్‌విధానంలో నిర్వహిస్తోన్న హైస్కూల్ ప్లస్‌లను ఎత్తివేయాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. తొలివిడతలో ఏలూరు జిల్లాలో ఏర్పాటైన 33 హైస్కూల్ ప్లస్‌లలో ఒక్క విద్యార్థి కూడా చేరని ఉంగుటూరు, చింతలపూడి హైస్కూల్ ప్లస్‌లు మినహా, మిగతా 31 కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుతం వీటిలో మొత్తం 708మంది బాలికలు ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో నిర్వహిస్తోన్న హైస్కూల్ ప్లస్‌ల ఎత్తివేత లేదా కొనసాగింపుపై తమవద్ద అధికారిక సమాచారమేదీ లేదని విద్యాశాఖవర్గాలు శుక్రవారం స్పష్టం చేశాయి.

ఇంటర్ ఫలితాలకు వాట్సాప్ నెంబరు

9552300009

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఏలూరు జిల్లాలో ప్రథమ సంవత్సరం 18,453మంది, ద్వితీయ సంవత్సరం 15,058 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పశ్చిమలో మొదటి సంవత్సరం 17,574 మంది, సెకండియర్ 16,271 మంది, ఒకేషనల్ పరీక్షలు 3792 మంది రాశారు. ఫలితాలు విడుదలైన వెంటనే ఆన్‌లైన్‌లో ప్రభుత్వ వెబ్‌సైట్ resultsbie.ap.gov.in లేదా సెల్‌ఫోన్‌లో 'మనమిత్ర' వాట్సాప్ నెంబరు 9552300009కు హాయ్ సందేశం పంపి రిజల్ట్, సబ్జెక్టుల వారీగా మార్కులు తెలుసుకోవచ్చు.



పశ్చిమలో 16 బాలికల పాఠశాలలు

తాడేపల్లిగూడెం రూరల్: పశ్చిమగోదావరి జిల్లాలో ప్లస్ టు పాఠశాలల్లో 2025 విద్యా సంవత్సరంలో 25 పాఠశాలలు కొనసాగాయి. వీటిలో 16 బాలికల పాఠశాలలు కాగా, 9 కోఎడ్యుకేషన్ పాఠశాలలు నిర్వహించారు. ఈ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 9 కోఎడ్యుకేషన్ 9 పాఠశాలల్లో 57 మంది మాత్రమే ఉండడంతో ఈ ఏడాది మూతపడనున్నాయి.

పెళ్లి కారును ఢీకొన్న లారీ

- పాలకొల్లు నుంచి ఏలూరులో వివాహ వేదికకు వెళుతున్న వరుడు
- నాచుగుంట వద్ద ప్రమాదం
- నలుగురికి గాయాలు
- అతి స్వల్ప గాయాలతో బయటపడి మూడు ముళ్లు వేసిన వరుడు



ప్రమాదంలో దెబ్బతిన్న పెళ్లి కారు

ఉంగుటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నాచుగుంట వద్ద పెళ్లి కారును లారీ ఢీకొంది. కారులో ఉన్న వరుడికి స్వల్ప గాయాలు కాగా మరో నలుగురి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో ఉన్నవారు ఏలూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా స్వల్ప గాయాలైన వరుడు ముహూర్త సమయానికే పెళ్లి పీటలపై వధువు మెడలో మూడు ముళ్లు వేశారు. ముహూర్త బలంతో వరుడు ప్రమాదం నుంచి బయటపడి శుభం జరిగిందని బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

పాలకొల్లుకు చెందిన గంటా నవీన్‌కు ఏలూరుకు చెందిన యువతితో శుక్రవారం రాత్రి వివాహం జరగనుంది. పెళ్లి కొడుకు, బంధువులు ప్రయాణిస్తున్న కారును నాచుగుంట వద్ద యూటర్న్ తీసుకుంటున్న లారీ అదుపుతప్పి ఢీకొంది. కారులో ఉన్నవారిలో జి.పద్మావతి, కె.నాగేశ్వరరావు, నాగమణి తీవ్రంగా గాయపడ్డారు. వారిని తొలుత హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పెళ్లి కుమారుడు గంటా నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయాలైన వారిలో ఇద్దరిని ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చేబ్రోలు ఎస్‌ఐ ఎం.సూర్యభగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన సమయంలో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రమాదం జరిగిన వాహనాన్ని వేరొక చోటికి తరలించారు.

మద్యానికి బానిసై.. యువకుడి మృతి

- పి.రాజవరంలో సంఘటన
- బెల్ట్ షాపులు తొలగించాలని మృతదేహంతో ఆందోళన
- బెల్ట్ షాపులో మద్యం తెచ్చి రోడ్డుపై ధ్వంసం చేసిన స్థానికులు



గ్రామంలో బెల్ట్ షాపులు తొలగించాలని మృతదేహంతో ఆందోళన (ఇన్‌సెట్) వంశీ (ఫైల్)

జీలుగుమిల్లి, ఏప్రిల్: 11 (ఆంధ్రజ్యోతి): పి.రాజవరంలో మద్యానికి బానిసై ఒక యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాకాని వంశీ (24) గ్రామంలో నడుస్తున్న బెల్ట్ షాపుల వద్ద నిత్యం మద్యం సేవిస్తున్నాడు. అతడి ఆరోగ్యం దెబ్బతినడంతో గురువారం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పెళ్లి కావాల్సిన యువకుడు మద్యానికి బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుని తీరని శోకం మిగిల్చాడని తల్లిదండ్రులు కాకాని దుర్గయ్య, వెంకాయమ్మ విలపించారు. గ్రామంలో బెల్టు షాపుల కారణంగా ఎక్కువ మంది మద్యానికి అలవాటు పడ్డారని స్థానికులు చెప్పారు. ఇటీవల మగాళ్లు మద్యంకు అలవాటు పడి కాయకష్టం చేసిన సొమ్ముతో తాగి ఊగుతున్నారని, మహిళలు కూలి పనికి వెళ్లి తెచ్చిన డబ్బులతో కుటుంబాల్ని గడుపుతున్నామన్నారు. గ్రామంలో బెల్ట్ షాపులు తీసేయాలని వంశీ మృతదేహంతో రోడ్డుపై కొద్దిసేపు ఆందోళన చేశారు. బెల్ట్ షాపుల్లో మద్యం తెచ్చి రోడ్డువేసి ధ్వంసం చేశారు. షాపులు తీసేయాలని మహిళలు చెప్పినా నిర్వాహకులు పట్టించుకోలేదన్నారు. ప్రముఖుల అండతో షాపులు నడుస్తున్నాయని ఆరోపించారు. గ్రామంలో విచ్చలవిడిగా వెలసిన మద్యం దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోపోవడం దారణమని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని 16వ నెంబర్ జాతీయ రహదారి దుగ్గిరాల బ్రిడ్జి వద్ద సర్వీసు రోడ్డులో గత నెల 31న ఉదయం ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు త్రీ టౌన్ సీఐ సెల్ నెంబర్ 9440904808 లేదా ఎస్‌ఐ సెల్ నెంబర్ 934777667కు సమాచారం ఇవ్వాలని త్రీ టౌన్ పోలీసులు కోరారు.

విద్యా సంస్థలో పెట్టుబడి పేరుతో మోసం

హర్షిత విద్యా సంస్థల కేసులో నందిగం ధర్మరాజు అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలో పెట్టుబడిపెడితే ఏడాదికి 24 శాతం వడ్డీ, లాభాల్లో 5 శాతం ఇస్తామని నమ్మబలికి మోసగించిన కేసులో ఒకరిని సీఐడి అధికారులు అరెస్టు చేసి శుక్రవారం ఏలూరు కోర్టులో హాజరు పరిచారు. కామవరపుకోట మండలం తడికలపూడిలో హర్షిత ఇంగ్లీషు మీడియం స్కూలు, హర్షిత ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులైన నందిగం రాణి, నందిగం ధర్మరాజు పలువురు కలిసి 15 మందిని మోసగించి కోట్లాది రూపాయలు వసూలు చేశారు. వారిపై సీఐడి అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రూ.14.74 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయాలని మార్చి 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమండ్రి సీఐడి విభాగం ఏఎస్పీ అస్మాఫరీనా పర్యవేక్షణలో సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హర్షిత ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్, ఈ కేసులో మూడో నిందితుడు నందిగం ధర్మరాజును శుక్రవారం సీఐడి అధికారులు అరెస్టు చేశారు. ధర్మరాజును ఏలూరులోని మొదటి అదనపు జిల్లా కోర్టునకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

కాలి నొప్పి భరించలేకే విద్యార్థిని ఆత్మహత్య

భీమవరం క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె కాలి నొప్పి భరించలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి ఫిర్యాదు చేశారు. ఈ నెల 10న పట్టణంలో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో హాస్టల్ రూమ్‌లో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో విద్యార్థిని ఉన్నం స్వర్ణకుమారి (19) ప్రమాదంలో కాలికి గాయమైంది. అప్పటి నుంచి ఇబ్బంది పడుతుంది. ఈ నెల 10న పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఉంటున్న తల్లికి కాలు బాగా ఇబ్బందిగా ఉందని ఫోన్ చేసి చెప్పింది. తల్లి రమాదేవి వస్తానని చెప్పింది. అయినా కూడా నొప్పి భరించలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా రమాదేవి ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్‌ఐ వైవి సత్యనారాయణ తెలిపారు.

బాలికకు ప్రసవం.. శిశువు మృతిపై విచారణ

బుట్టాయగూడెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని గర్భం దాల్చడం, ప్రసవం అనంతరం శిశువు మృతి చెందడంతో ఐటీడీఏ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఏలూరులోని ఆస్పత్రిలో గురువారం బాలికకు ప్రసవం కాగానే శిశువు మృతి చెందింది. బాలికను బుట్టాయగూడెం సీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. నెలలు నిండకుండా శిశువు జన్మించడంతో మృతి చెందినట్లు డిప్యూటీ డిఎంహెచ్‌వో జె.సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కొండరెడ్డి గ్రామానికి చెందిన బాలిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమె గత ఏడాది జూన్ నుంచి డిసెంబరు వరకు పాఠశాలకు రాలేదని, 2025 జనవరి, ఫిబ్రవరిలో వారం రోజులు చొప్పున మాత్రమే పాఠశాలకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆశ్రమ పాఠశాల సంరక్షకురాలు బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు పాఠశాలకు పంపలేదన్నారు. ప్రసవం, శిశువు మృతి సమాచారంతో గ్రామానికి వెళ్లి తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించినట్లు ఇన్‌చార్జి డీడీ శ్రీవిద్య తెలిపారు. దీనిపై ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్‌కు నివేదిక ఇచ్చామన్నారు.

పెన్నాడలో చోరీ యత్నం.. దొంగకు దేహశుద్ధి



దొంగను పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

పాలకోడేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అగంతకుడు చోరీకి ప్రయత్నించాడు. గమనించిన స్థానికలుఉ అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు.

పోలీసులకు అప్పగింత

అనంతరం పోలీసులకు అప్పగించిన ఘటన పాలకోడేరు మండలం పెన్నాడలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన సిగడం గణేశ్ ఇంట్లో ఒక అపరిచిత వ్యక్తి ప్రవేశించి చోరీకి ప్రయత్నించాడు. స్థానికులు అప్రమత్తమై చోరీకి ప్రయత్నించిన వ్యక్తిని నిలదీశారు. అతడి వివరాలు చెప్పకపోవడంతో పట్టుకుని దేహశుద్ధి చేశారు. పాలకోడేరు పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



తక్కెళ్లపాడులో రైస్ పరిశ్రమను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం

మంత్రి టీజీ భరత్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్ అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో రైస్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి రైస్ పరిశ్రమను ప్రారంభించిన అనంతరం పూర్తిగా పరిశీలించి వివరాలను యజమానులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలతో ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. భవిష్యత్‌లో ఈ పరిశ్రమను విస్తరించేందుకు యాజమాన్యం ప్రణాళిక రూపొందించాలన్నారు. దాదాపు 600 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందన్నారు.

వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో అదనపు సీట్లు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వాసవి ఇంజనీరింగ్ కళాశాలకు 2025-26 విద్యా సంవత్సరానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులలో అదనపు సీట్లు అందుబాటులో ఉంటాయని పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు తెలిపారు. ఈ విభాగాల్లో మొత్తం 120 సీట్లను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి మంజూరు చేసినట్టు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం సీఎస్ఈ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్) 120 సీట్లను 180, ఏఐ ఎంఎల్ కోర్సులో 120 సీట్ల నుంచి 180కి పెంచడం జరిగిందన్నారు. పెరిగిన సీట్లతో బీటెక్ సీట్ల సంఖ్య 1320 కాగా ఈబీసీ రిజర్వేషన్ సీట్లతో కలిపి 1452 సీట్లు ఉన్నట్టు తెలిపారు.

తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ కోర్సు

తణుకు, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాలలో రానున్న విద్యాసంవత్సరం నుంచి కంప్యూటర్ బ్రాంచ్ ఏర్పాటుకు ఏఐసీటీఈ అనుమతి లభించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.తులసీరాధ చెప్పారు. శుక్రవారం ఆమె వివరాలు తెలిపారు. విద్యార్థులు కంప్యూటర్ కోర్సుపై మక్కువ చూపుతున్నారన్నారు. కళాశాలలో సివిల్, మెకానికల్, ఎల క్ట్రికల్ కోర్సులతో పాటు కంప్యూటర్ కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. పాలిసెట్ ఈనెల 30న జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష రాయనున్న అభ్యర్థులకు జిలాలో ఏడు కేంద్రాల్లో 600 మందికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తులసీరాధ చెప్పారు.

బావ మరిదిపై దాడి

భీమవరం క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బావమరిదిపై బావ కర్రతో దాడి చేశాడు. టూటౌన్ ఏఎస్‌ఐ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం రాయలం గ్రామానికి చెందిన రామకోరి సన్నిబాబు గురువారం రాత్రి మద్యం సేవించి వచ్చి వెంట బీరు తీసుకువచ్చాడు. ఇంట్లో ఉన్న బావమరిది మేడిది పవన్ బావను నిలదీశాడు. దీనితో సన్నిబాబు కర్రతో పవన్‌పై దాడి చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పని ఆపారంటూ దాడి..

పాలకొలుకు చెందిన కుక్కల కిరణ్, అతని సోదరులు మెంటేవారి తోటకు చెందిన గర్రె సందీప్ భవనం నిర్మించడానికి కాంట్రాక్ట్ తీసుకున్నారు. పని పూర్తి చేయకపోవడంతో సందీప్, అతని స్నేహితుడు రాయితో కొట్టారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మోహనరావు తెలిపారు.

14న శ్రీరామ జప యజ్ఞం

కామవరపుకోట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) :తడికలపూడిలోని గాంగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 14న శ్రీరామ జప యజ్ఞ కార్యక్రమాన్ని స్కంద స్వామిజీ షణ్ముఖ పీఠం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ రోజు గోపూజ, పూర్ణాహుతి, స్వామిజీ ప్రసంగం, ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. దేశ ధర్మాలు, దేవాలయాల రక్షణ కోసం సంకల్పించే ఈ యజ్ఞంలో అంతా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని జప యజ్ఞ నిర్వహణ సమితి నాయకులు అత్యం వెంకటేశ్వరరావు కోరారు.

కృష్ణకు అంబేడ్కర్ పురస్కారం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) :గుంటూరుకు చెందిన దక్షిణాది రాష్ట్రాల ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయుల సంఘం ఈ నెల 13న పురస్కారాలు అందజేయనుంది. ఈ మేరకు అందజేసే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఏలూరు రూరల్ మండలం ఇందిరాకాలనీ ఎంపీయూపీ స్కూలు ఉపాధ్యాయుడు జి.కృష్ణ ఎంపికయ్యారు. ఈ నెల 13న నిర్వహించే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని కృష్ణకు అందజేస్తామని సంస్థ అధ్యక్షుడు నాగయ్య తెలిపారు.

ఆదివాసీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

బుట్టాయగూడెం/ఏలూరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గిరిజన సాయుధ పోరాట యోధుడు పైలా వాసుదేవరావు వర్ధంతిని ముంజులూరులో నడపల ముక్కారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ పైలా వాసుదేవరావు స్ఫూర్తితో ఆదివాసీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గిరిజన చట్టాలు, హక్కులను, అటవీ సంపదను రక్షించుకోడానికి పోరాటాలకు సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.లత, సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి, చూండ్రు సుబ్బారెడ్డి, కెచ్చెల రామిరెడ్డి పాల్గొన్నారు. ఏలూరు మార్కెట్ యార్డులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఇఫ్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, గడసాల రాంబాబు, ఎం.అప్పారావు, గంగరాజు, మీసాల రమణ, బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పైలా వాసుదేవరావు వర్ధంతిని నిర్వహించారు.

సెయింట్ జోసఫ్ దంత కళాశాలలో క్రీడలు

పెదవేగి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) :సెయింట్ జోసఫ్ కళాశాలలో అంతర్గత క్రీడా పోటీలను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్, ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవ. బిషప్ జయరావు పొలిమేర ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ చేసి క్రీడా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ సీవరాజు, జానంపేట ఫాదర్ చిన్ను, పీడీ నల్లయ్య, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు ఆశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి వైద్య పరికరాల అందజేత

టి.నర్సాపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : టి.నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి జంగారెడ్డిగూడెం నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్ సభ్యులు వైద్య పరికరాలను జె.ఎస్.చౌదరి ఆధ్వర్యంలో అందజేసినట్టు మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఫణేంద్రబాబు తెలిపారు. 68 రకాల వైద్య పరికరాలు, ఆసుపత్రి సామగ్రి అందజేసినట్టు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ మొదుగు సునంద, వైద్యాధికారిణి కె.కల్పనారాణి, నవభారత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో సహజ వనరుల దోపిడీని తిప్పికొట్టాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): టూరిజం అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లోని సహజ వనరులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలనే ప్రభుత్వ కుట్రలను ఆదివాసీలు తిప్పికొట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం బుట్టాయగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అరకులోయ పర్యటనలో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తానని ప్రకటన చేయడం వెనుక గిరిజన చట్టం సవరణ కుట్ర దాగిఉందన్నారు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు ఆదివాసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, ఉడతా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీరు, పంట కాల్వలు, డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల నాయకులకు సూచించారు. నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ మురళి సమక్షంలో వివిధ నీటి సంఘాల నాయకులు ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో ఉంగుటూరులో సమావేశం నిర్వహించారు. అనంతరం నిడమర్రు మండల శివారు గ్రామాలైన తోకలపల్లి, భైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామాలకు తాగునీటి సమస్యపై చర్చించారు.

బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కామవరపుకోట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికి సభ్యులు ఐక్యంగా చేయాలని ఏలూరు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు వేమూరు శ్రీనివాస్ కోరారు. బీజేపీ కార్యాలయంలో నాయకులు సమావేశమై కామవరపుకోట మండలాధ్యక్షునిగా ఎస్.ఆర్.ఆర్.ఎల్.ఎస్.ఎన్.రాజును నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో కిసాన్ మోర్చ జోనల్ ఇన్‌చార్జి అర్జుల మురళీకృష్ణ, కిసాన్ మోర్చ ఏలూరు జిల్లా అధ్యక్షులు కీర్తి రాంప్రసాద్, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు ఏసు వరప్రసాద్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీవారు, ఉభయ దేవేరులతో కలిసి క్షేత్ర పురవీధుల్లో శుక్రవారం రాత్రి అట్టహాసంగా ఊరేగారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కం వాహనంపై ఉంచి అలంకరించారు. అనంతరం పూజాధికాలు జరిపి హారతులు సమర్పించారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారు కొలువైన వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా పురవీధులకు పయనమవగా భక్తులు శ్రీవారు, అమ్మవార్లకు హారతులు పట్టారు.

సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొయ్యలగూడెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని అరిపాటిదిబ్బల వద్ద సహకారం గవరవరం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రుణాలు, ఎరువులు షాపులు కాకుండా పెట్రోల్ బంకులు కూడా ఏర్పాటు చేసి రైతులకు ప్రభుత్వం మేలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గడ్డమనుగు రవికుమార్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, టీడీపీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, నరసింహరాజు, డీసీసీబీ మేనేజర్ కనకమహాలక్ష్మి, సొసైటీ సెక్రటరీ రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నగరేశ్వర స్వామి కల్యాణోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : అగ్రహారంలోని నగరేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమం, బలిహరణ నిర్వహించి ఎదుర్కోలు సన్నాహాన్ని జరిపి అనంతరం శ్రీగంగా వింధ్యావాసిని సమేత నగరేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు మల్లికార్జునరావుశర్మ ఆధ్వర్యంలో జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి గ్రామోత్సవం, శనివారం వసంతోత్సవం, సోమవారం పూర్ణాహుతి, పవళింపు సేవతో వార్షిక కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని ఈవో నాగబాబు తెలిపారు.

వేసవిలో రెండు పూటలా తాగునీరందిస్తాం

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో రెండు పూటలా తాగునీరందిస్తామని నగర కమిషనర్ ఏ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు తెలిపారు. దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శుక్రవారం కమిషనర్‌తో కలిసి పెదబాబు పరిశీలించారు. గోదావరి జలాలతో వాటర్ ట్యాంకు 15 రోజుల్లో నింపుతామన్నారు. ప్రజల్లో ఆందోళన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు డి.శ్రీనివాస్, కె.నరసింహరావు, శామ్యూల్‌పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమమే

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమిస్తామని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఏలూరు ఆర్టీసీ డిపో ముందు శుక్రవారం సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు ధర్నా, గేటు మీటింగ్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, జోనల్ మెంబర్ ఎస్.ప్రసాదరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.ఎస్.రావు, డిపో ప్రెసిడెంట్ ప్రసాద్, డిపో జాయింట్ సెక్రటరీ కె.ఆర్.కె.రావు, గంగరాజు, ఎస్.బాబు పలువురు పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ దిగ్గజం అరబిందో ఫార్మా లిమిటెడ్ కంపెనీలో వివిద ఉద్యోగాల భర్తీకి శుక్రవారం సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. సీఆర్ఆర్ విద్యా సంస్థలకు చెందిన డిగ్రీ, పీజీ, రాష్ట్రంలోని పలు ఫార్మసీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశామని కంపెనీ ప్రతినిధులు వివరించారు. ఇలా ఎంపికైన వారిలో ఫార్మసీ కళాశాల విద్యార్థులు 30మంది, ఇతర కళాశాలల విద్యార్థులు 40మంది ఉద్యోగాలు సాధించారని కరస్పాండెంట్ ఎం.రాజారామ్మోహనరావు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు మామిడి కాయలు అందజేస్తున్న ఘంటా మురళి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కొలుసు పార్థసారథి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం, పాల్గొన్న గన్ని, పుట్టా



ఆగిరిపల్లి మండలం వడ్లమానులో కుటుంబ సభ్యులతో సీఎం

సీఎంకు ఘన స్వాగతం

నూజివీడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం ఆగిరిపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న మంత్రులు కొలుసు పార్థసారథి, ఎస్.సవిత, కొల్లు రవీంద్రతో పాటు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ, కామినేని శ్రీనివాస్, పి.ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు శరణాల మాలతిరాణి, ఏలూరు ఐజీ అశోక్ కుమార్, కలెక్టర్ కె.వెట్రిసెల్వీ, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ ముఖ్యమంత్రికి స్వాగతం పలికినవారిలో ఉన్నారు. ఆగిరిపల్లిలో టీడీపీ నాయకుడు మడుపల్లి గోపాల్ సైకిల్ గుర్తు బహూకరించారు. టీడీపీకి మూడు దశాబ్దాలుగా గోపాల్ సేవలను సీఎం అభినందించారు.



చంద్రబాబుతో ఎస్పీ దంపతులు



మామిడి పండ్లు అందజేస్తున్న శరణాల మాలతీరాణి



సైకిల్ గుర్తు అందజేస్తున్న నాయకుడు మడుపల్లి గోపాల్



సీఎంకు జేజేలు పలుకుతున్న స్థానికులు



వీణ అందజేస్తున్న అభిమాని



సీఎం సభకు హాజరైన మహిళలు



పారిశ్రామికంగా అభివృద్ధి చేయండి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి సహకారం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఎంపీ మహేశ్ కుమార్ కోరారు. ఆగిరపల్లి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మహేశ్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిశ్రమలు నెలకొల్పేందుకు అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. భూముల ధరలు అధికంగా ఉండటం వలన పారిశ్రామికవేత్తలు ముందుకు రావడంలేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు స్థానికంగానే ఉద్యోగాలు కల్పించవచ్చని అన్నారు.

శిశువుల ఆరోగ్యానికి పరిశుభ్రత ముఖ్యం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శిశువుల్లో ఇన్ఫెక్షన్లు నివారించడానికి బాలింత చేతులను శుభ్రపరచుకోవడం మంచి మార్గమని జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూలా అన్నారు. శ్రీవారి దేవస్థానం హైస్కూల్లో శుక్రవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కిశోర బాలికలు, బాలింతలు, గర్భవతులకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. 11నుంచి 18 ఏళ్ల వయస్సున్న వారు తీసుకోవాల్సిన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పిల్లల తల్లులు, కిశోర బాలికలు చేతులు శుభ్రం చేసుకునే ఏడు రకాల విధానాలను చేసి చూపించారు.

బీసీలకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ బీసీలకు ఆర్థిక,రాజకీయ స్వాతంత్ర్యం తీసుకొచ్చింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. నవ్యాంధ్రలో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలను తిరుగుముఖం పట్టేలా చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని, తరలివెళ్లిన పెట్టుబడులను తిరిగి తీసుకువచ్చి నేడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు అశోక్ లైలాండ్ పరిశ్రమను ప్రారంభించారన్నారు. అతి త్వరలో మిట్టల్‌కు సంబంధించిన పరిశ్రమ రాష్ట్రంలో ప్రారంభమవుతుందన్నారు. బీసీల నమ్మక ద్రోహి జగన్ అని, బీసీలకు తీసుకువచ్చిన పథకాలను రద్దు చేశారన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన విదేశీ విద్యను చంద్రబాబు తిరిగి ప్రవేశపెట్టారని చెప్పారు. ఒక్క ఛాన్స్ అన్న జగన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చి ఆయన సేవలకు స్వస్తి పలికారని ఆమె ఎద్దేవా చేశారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరిగితే ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చింది టీడీపీనే అని దానికి ఉదాహరణ తన తండ్రి సుధాకర్ యాదవ్, తానేనన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం..



మఠంగూడెం : ప్రారంభానికి నోచుకోని భవనం



కొత్తపల్లిలో పునాదులకే పరిమితమైన భవనం

- ప్రజలకు సేవలందించే ప్రభుత్వ భవనాల పట్ల నిర్లక్ష్యం
- అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయాలంటూ విజ్ఞప్తులు

లింగపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలు కొన్ని, నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా మారిన ప్రభుత్వ భవనాలు మరికొన్ని పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారాయి. గత వైసీపీ హయాంలో సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి ఆర్భాటపు ప్రచారాలు చేసింది. ఈ నేపథ్యంలో కొందరు పార్టీ అనుకూల సభ్యులకే భవన నిర్మాణ కాంట్రాక్టులను అప్పజెప్పింది. నిర్మాణాలు చేపట్టిన వెంటనే బిల్లులు అందిస్తామంటూ ఆశచూపడంతో కొందరు కాంట్రాక్టర్లు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఈ భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే బిల్లులు సరిగా రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలు మధ్యలోనే ఆపేశారు. కొన్ని చోట్ల పునాదులకే పరిమితమవ్వగా మరికొన్ని చోట్ల ఏదోవిధంగా నిర్మాణాలు పూర్తి చేశారు. దాదాపుగా నిర్మాణాలు పూర్తయిన సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, రైతు సేవా కేంద్రాలు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని చోట్ల ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. ఇప్పటికైనా ఈ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ పనులు కొత్తవారికి అప్పగిస్తాం..



మండలంలో ప్రభుత్వ భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలోనే బిల్లులు అందజేశాం. అసంపూర్తిగా ఉన్న భవనాలను సకాలంలో పూర్తి చేయాలని హెచ్చరించినా కొందరు కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. వారిని తొలగించి ఆ కాంట్రాక్టును కొత్తవారికి అప్పగిస్తాం. పూర్తయిన ప్రభుత్వ భవనాలను త్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.

జగన్నాథరావు, ఏఈ, లింగపాలెం



ఇంటర్వ్యూ..

రూ.9.50 కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

సి.హెచ్.పద్మావతి దేవి, ఎంపీడీవో, భీమడోలు

● **తాగునీటి సమస్యకు పరిష్కారమేంటి?**

జవాబు : వేసవి దృష్ట్యా సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొల్లేరు గ్రామాల్లో ఇప్పటికే మంచినీటి చెరువులు నింపుకోవాలని ఆదేశించాం. జలజీవన్ మిషన్ పథకంలో గ్రామాల్లో ఇంటింటికి కుళాయిలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

● **అభివృద్ధికి చేపట్టిన చర్యలేంటి?**

జవాబు : మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ రూ.9.50 కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. కాలనీల్లో గ్రావెల్ రోడ్లు వేస్తున్నాం. మండల వ్యాప్తంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.

● **చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది?**

జవాబు : క్లాప్ మిత్రల ద్వారా చెత్తను సేకరించి ఎరువు తయారు చేసే కార్యక్రమాలు చేపడుతున్నాం. గత రెండ్రోజులుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్నాం.

● **స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రపై చేపట్టిన కార్యక్రమాలేంటి?**

జవాబు : ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పించాం. గ్రామ కార్యదర్శులు బాధ్యతగా గ్రామాల్లో పారిశుధ్యంపై చర్యలు తీసుకునేలా ఆదేశాలిచ్చాం.

భీమడోలు, (ఆంధ్రజ్యోతి)

పోరాట యోధుడు పూలే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటి, నూర్జహాన్

(ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్)

పోరాటాలకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతి రావు పూలే అని ఏలూరు ఎమ్మెల్యే చంటి అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని జూట్‌మిల్లు సెంటర్‌లోని విగ్రహాలకు ఎమ్మెల్యే చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్. పెదబాబు పాల్గొన్నారు. ఎస్సీ ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షులు ఎం.అశోక్ కుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నేతర అజయ్ బాబు, ఎం.వెంకన్న, బాలరాజు, ఎన్.శ్రీను, జాకబ్ పాల్గొన్నారు. ఏలూరు జడ్పీ కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి

జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించిన నాయకులు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.దాన భాస్కరరావు, గాది రాంబాబు, ఎ.అప్పారావు, డి.శేష శయన, బాడిత నారాయణ, ఏలూరు విద్యుత్ భవన్‌లో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కంపెనీ అధ్యక్షుడు కె.గంగాధర రావు, విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.ఎం.అంబేద్కర్, పి.శ్రీనివాస్, ఫైనాన్స్ ఏవో పి.శ్రీదేవి పాల్గొన్నారు. బీసీ జేఏసీ ఆంధ్రప్రదేశ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఏలూరు జిల్లా బీసీ ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జూట్ మిల్లు సెంటర్ వద్ద, జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం పి.సురేశ్, తెలుగు పండిట్ డాక్టర్ మద్దాల పెద్దిరాజులు, ఉపాధ్యాయులు శారద, మల్లయ్య, కుమారస్వామి, రమేశ్, ప్రభాకరరావు, సుబ్బారావు, రాజేశ్వరమ్మ జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పెదవేగి మండలంలో పెదవేగి ఈవోపీఆర్డీ షేక్ షరీఫ్, ఏపీవో హేమలత, ఏవో సత్యనారాయణ, ఈవో కె.శ్రీనివాసరావు, అల్లి సాహెబ్ పాల్గొన్నారు. చింతలపూడిలోని మేడబడి సెంటర్‌లో ఉన్న పూలే విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ నాయకులు తోట నారాయణరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉమామహేశ్వరరావు, గణేష్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, షేక్ ముస్తాఫా, రాజాన పండు, సూర్యశ్రీనివాస్ పాల్గొన్నారు. టి.నర్సాపురం అంబేద్కర్ సెంటర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా బీసీ విభాగాల కోఆర్డినేటర్ కొండపల్లి రవి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరులో కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిబాబు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు పోటీలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

గంగన్నగూడెంలో ఆలయ శిఖర ప్రతిష్ఠ

దెందులూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : గంగన్నగూడెంలోని శ్రీ హనుమలక్ష్మణ సీతా సమేత శ్రీ పట్టాభిరాముల వారి నూతన ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాధమ్మ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి చిత్రపటాన్ని చింతమనేని ప్రభాకర్ దంపతులకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో గంగన్నగూడెం సర్పంచ్ ఉప్పలపాటి లక్ష్మణరావు, ప్రముఖ వ్యాపారవేత్త ఘంట ప్రసాద్‌రావు, శివ, వెన్నమనేని రాజా, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న చింతమనేని దంపతులు



సభలో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్

అభివృద్ధికి కలిసి పనిచేస్తాం : ఎంపీ

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే, ఎంపీల మధ్య ఎలాంటి విబేధాలున్నా కలిసి పని చేస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. శుక్రవారం ఆలపాటి గంగా భవన్ కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు అధ్యక్షతన పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సభలో ఎంపీ మహేశ్ మాట్లాడుతూ కొంత మంది చిల్లర రాజకీయాలు చేస్తూ విబేధాలు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. కొవ్వూరు - భద్రాచలం రైల్వే లైనుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా నిధులు ఇవ్వాలని కేంద్రం చెప్పిందని పూర్తిగా కేంద్రం నిధులతోనే రైల్వే లైను పూర్తి చేసేలా చర్యలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్, కరాటం రాంబాబు, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులను బట్టి మాసూళ్లు చేపట్టాలని, ధాన్యం తరలింపు విషయంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తామని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ అన్నారు. మండలంలోని గుణ్ణంపల్లిలో శుక్రవారం జరిగిన రైతు గ్రామ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పి.కన్నాపురం పేడీ ప్రొక్యూర్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీవో ఏ దుర్గా రమేశ్, తహసీల్దారు జె.వి.సుబ్బారావు, గుణ్ణంపల్లి సొసైటీ కార్యదర్శి జంగా రాంబాబు పాల్గొన్నారు.

జైనవారిగూడెంలో రైతులకు అవగాహన..

బుట్టాయగూడెం : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.వి.చలపతిరావు అన్నారు. శుక్రవారం జైనవారిగూడెంలో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుపై స్థానిక రైతు సేవా కేంద్రం నందు సర్పంచ్ తాటి సీత అధ్యక్షతన గ్రామసభలో పాల్గొని అవగాహన కల్పించారు.మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు మాట్లాడుతూ రైతులు తప్పకుండా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని, అటవీ భూములు, డి.నమూనా పట్టాలు కలిగిన రైతులు కూడా సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎం.సురేశ్, కె.సాయిబాబా, సిఎస్ఆర్ఐ కె.పద్మావతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై శిక్షణ

పెదపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : పెదపాడు, ఏలూరు రూరల్ మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, పారిశుధ్య సిబ్బందికి స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రపై ఒకరోజు శిక్షణను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్పీవో పూర్ణ చంద్రశేఖర్ వారికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.గ్రామాలను శుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల ఎంపీడీవో అమీలుజమ, శ్రీలత, ఈవోలు వినోద్, ఎం.శ్రీనివాస్, శివయ్య, పద్మారావు పాల్గొన్నారు.

వచ్చే నెల చలో తిరుపతి

ఏలూరు కార్పొరేషన్/ కామవరపుకోట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు మే 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరగుతున్నట్టు ఏఐవైఎఫ్ నాయకులు పి.కిశోర్, సీపీఐ కామవరపుకోట మండల నాయకుడు టి.వి.ఎస్.రాజు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు నాయకులు చలో తిరుపతికి పిలుపునిచ్చారు.

గ్యాస్ ధర తగ్గించాలి

కుక్కునూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కునూరులో ఆందోళన నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు మరచి పన్నుల భారాలు పెంచుతుందని నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కే.గౌస్, కే.కల్లయ్య, ఎస్.కె.మున్ని, చోడే చిరమయ్య, ఎం.రమేశ్ పాల్గొన్నారు.

వచ్చేనెల 10న లోక్ అదాలత్

కైకలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఎక్కువ కేసులను రాజీ చేసుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ అన్నారు. శుక్రవారం కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో మాట్లాడుతూ వచ్చేనెల 10న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని వివిధ కేసుల్లో ఉన్న కక్షిదారులు రాజీమార్గాన్ని ఎంచుకొని కేసులు పరిష్కరించుకోవాలని కోరారు.

జ్యోతిరావు పూలేకు నివాళులు

కైకలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పేదవర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పూలే 198వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళా విద్యకు వారు చేసిన కృషి ఎనలేనిదన్నారు. మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, కూటమి నేతలు పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, గరికిపాటి రాంబాబు, సమయం ఏసుబాబు, గంగునేని వరప్రసాద్, వేల్పూరి చంద్రరావు, తేరా రమేష్‌బాబు, బోడావుల బాలాజీ, లక్కింశెట్టి మోహన్ పాల్గొన్నారు.


కైకలూరులో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ముదినేపల్లిలో నిర్వహించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద పూలే విగ్రహానికి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, విగ్రహ కమిటీ నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, పల్లెం పుణ్యేశ్వరరావు, సోమల వరప్రసాద్, జన్ను వీర వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మీ, పార్టీ నాయకులు వత్సమిల్లి ప్రసాద్, మీసాల సత్యనారాయణ, కొల్లిపర నాగరాజు, భుజంగ వెంకట నరసింహారావు, బండారు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : వర్ణవివక్షను రూపుమాపడం కోసం దళిత, మహజన, మహిళా వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే కార్యాచరణ మహోన్నతమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. కుల, విద్య సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే వారి ఆలోచనా విధానమే స్ఫూర్తిగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. బాపునగర్‌లో పూలే చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి, నాయకులు పూలమాలలు వేసి నివాళర్పించారు. బోసు అప్పారావు, ఎం.రాజశేఖర్, మాగంటి వాసు, కంచర్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు దోసపాటి మల్లికార్జున జగదీశ్, దనాల రవికిశోర్, కార్యదర్శి సూర్య ప్రకాష్‌కుమార్, షేక్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.


నూజివీడులో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మండవల్లి : మండవల్లి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కె.శాంతరాజు, గౌరవ అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, అసోసియేషన్ ముఖ్య సలహాదారు గోరింక గాంధీ తదితరులు పూలే, సావిత్రిబాయిపూలే చిత్రపటాలకు, అంబేడ్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండపల్లి నాంచారయ్య, చేబోయిన వెంకటేశ్వరరావు, కట్ట వెంకటేశ్వరరావు, గూడపాటి యాకోబు, ఫణి, మరియుదాసు, జవ్వాది వెంకటేశ్వరరావు, గాజులపల్లి వెంకటేశ్వరరావు, సుధాకరరావు, నల్లగొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు : మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఏవో ద్రోనవల్లి ఛాయదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎంఈవో కార్యాలయానికి జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలను ఎస్టీయూ నాయకులు బహూకరించారు. ఎంఈవో టీవీఎస్.సుబ్బారావు నివాళులర్పించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు జీవీ.రత్నం, ప్రధాన కార్యదర్శి కొప్పుల బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15 వరకు మూడుతాళ్లపాడు రైల్వే గేటు మూసివేత

మండవల్లి ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండవల్లి గ్రామంలోని మండవల్లి-మూడు తాళ్లపాడు రైల్వే గేటును రెండురోజులు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎండీ అబ్దుల్ రెహమాన్ తెలి పారు. లెవెల్ క్రాసింగ్ 74 (63 కిలోమీటరు) వద్ద అత్యవసర ట్రాక్ మరమ్మతులు పనులు పూర్తి అవనందున ఈనెల 15వ తేదీ రాత్రి 7గంటల వరకు గేటు మూసివేసి ఉంటుందని ఒక ప్రకటనలో తెలిపారు.


మూడుతాళ్లపాడు రైల్వేగేటు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పాఠశాలల్లో డీఈవో తనిఖీలు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, తోటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, తోటపల్లి హిల్ పాఠశాలను శుక్రవారం డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. బడి మానేసిన పిల్లలు తిరిగి పాఠశాలల్లో చదువుచున్నారా అని ఆరా తీశారు. జడ్పీ ఉన్నత పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం వివరాలు తనిఖీ చేశారు. కార్యాక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జి.రాధాకృష్ణ, ఎంఈవో కె.సర్వేశ్వరరావు, కె. ఆనంద్ కుమార్, హైస్కూల్ హెచ్ఎం పి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి పోటీల్లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన వేదిక నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ ఎక్స్‌పెరిమెంట్స్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని త్రివిధ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మూఢ నమ్మకాలు, విశ్వాసం అంశంలో జిల్లా స్థాయి లో ప్రథమ, ద్వితీయ బహుమతులు, సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన గీతిక, రక్షిత, వింధ్య, అఖిల్, సూర్య, అభిషేక్ పాల్, పవన్‌కృష్ణ, సుజిత్, మహిత్‌ను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాస్

నేడు ఇంటర్ ఫలితాలు

95523 00009 వాట్సాప్ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే సబ్జెక్టుల వారీగా మార్కుల వెల్లడి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్స రం పరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11గంటలకు విడుద ల కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 1నుంచి 20వరకు జరుగ గా, ప్రధాన పరీక్షలు 15న ముగిశాయి. జవాబు పత్రాల మూ ల్యాంకనం ఈ నెల 3న ముగిసింది. ఫలితాలు విడుదలైన వెం టనే ఆన్‌లైన్‌లో ప్రభుత్వ వెబ్‌సైట్ results-bie.ap.gov.in నుంచి లేదా సెల్‌ఫోన్‌లో 'మనమిత్ర' వాట్సాప్ నెంబరు 9552300009కు హాయ్ సందేశం విద్యార్థులు పంపి రిజల్ట్, సబ్జెక్టుల వారీగా మార్కులు తెలుసుకునే ఏర్పాట్లు చేశారు.

బీసీలకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ బీసీలకు ఆర్థిక,రాజకీయ స్వాతంత్ర్యం తీసుకొచ్చింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. నవ్యాంధ్రలో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలను తిరుగుముఖం పట్టేలా చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని, తరలివెళ్లిన పెట్టుబడులను తిరిగి తీసుకువచ్చి నేడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు అశోక్ లైలాండ్ పరిశ్రమను ప్రారంభించారన్నారు. అతి త్వరలో మిట్టల్‌కు సంబంధించిన పరిశ్రమ రాష్ట్రంలో ప్రారంభమవుతుందన్నారు. బీసీల నమ్మక ద్రోహి జగన్ అని, బీసీలకు తీసుకువచ్చిన పథకాలను రద్దు చేశారన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన విదేశీ విద్యను చంద్రబాబు తిరిగి ప్రవేశపెట్టారని చెప్పారు. ఒక్క చాన్స్ అన్న జగన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చి ఆయన సేవలకు స్వస్తి పలికారని ఆమె ఎద్దేవా చేశారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరిగితే ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చింది టీడీపీనే అని దానికి ఉదాహరణ తన తండ్రి సుధాకర్‌యాదవ్, తానేనన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

ముదినేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి శివారు అన్నవరంలో ఉన్న సీతారామ మారుతీ ఆలయంలో శనివారం జరుగనున్న కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవస్థానం ధర్మకర్త ముప్పవరపు రాఘవేంద్రరావు పర్యవేక్షణలో సీతారాముల కల్యాణానికి స్వామివార్లను, అమ్మవార్లను సిద్ధం చేశారు. శ్రీరామనవమి వెళ్లిన అనంతరం వచ్చే పౌర్ణమి రోజున సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.


సీఎం చంద్రబాబుకు మామిడి కాయలు అందజేస్తున్న ఘంటా మురళి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కొలుసు పార్థసారథి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం, పాల్గొన్న గన్ని, పుట్టా




ఆగిరిపల్లి మండలం వడ్లమానులో స్థానికులతో సీఎం

సీఎంకు ఘన స్వాగతం

నూజివీడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం ఆగిరిపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న మంత్రులు కొలుసు పార్థసారథి, ఎస్.సవిత, కొల్లు రవీంద్రతో పాటు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ, కామినేని శ్రీనివాస్, పి.ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు శరణాల మాలతిరాణి, ఏలూరు ఐజీ అశోక్ కుమార్, కలెక్టర్ కె.వెట్రిసెల్వీ, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ ముఖ్యమంత్రికి స్వాగతం పలికినవారిలో ఉన్నారు. ఆగిరిపల్లిలో టీడీపీ నాయకుడు మదుపల్లి గోపాల్ సైకిల్ గుర్తు బహూకరించారు. టీడీపీకి మూడు దశాబ్దాలుగా గోపాల్ సేవలను సీఎం అభినందించారు.


చంద్రబాబుతో ఎస్పీ దంపతులు


సైకిల్ గుర్తు అందజేస్తున్న నాయకుడు మదుపల్లి గోపాల్


వీణ అందజేస్తున్న అభిమాని


సీఎం సభకు హాజరైన మహిళలు


మామిడి పండ్లు అందజేస్తున్న శరణాల మాలతీరాణి


సీఎంకు జేజేలు పలుకుతున్న స్థానికులు



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి సీఎంకు ఆహ్వానం

ముసునూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్ ప్రాజెక్ట్ కామధేను ప్లాంట్‌లో సీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని సీఎం చంద్రబాబును చైర్మన్ చలసాని ఆలంజనేయులు ఆహ్వానించారు. శుక్రవారం ఆగిరిపల్లి పర్యటనకు వచ్చిన సీఎంను కలిసి ఈ 16న జరిగే ప్రతిష్ఠకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.

మామిడి పండ్ల అందజేత...

కైకలూరు: ఆగిరిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్ తదితర ఎమ్మెల్యేలతో కలిసి కామినేని మామిడిపండ్ల బుట్టను సీఎంకు అందజేశారు.


సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

క్యాంపుబెల్ ప్రధాన కాల్వ గట్లను పటిష్టం చేయాలి

చేవూరు సాగునీటి వినియోగదారుల సంఘ సమావేశం తీర్మానం

ముదినేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) :ముదినేపల్లి, గుడ్లవల్లేరు, కలిదిండి, కైకలూరు మండలాలకు చెందిన వేలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తున్న క్యాంపుబెల్ ప్రధాన కాల్వ గట్లను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని చేవూరు సాగునీటి వినియోగదారుల సంఘ సమావేశం తీర్మానించింది. శుక్రవారం ముదినేపల్లిలోని వడాలి సెక్షన్ ఇరిగేషన్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు సాయిన వీర సూర్య ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో క్యాంపుబెల్ ప్రధాన పంట కాల్వకు గుడ్లవల్లేరు నుంచి శ్రీహరిపురం వరకూ గట్లు బలహీనంగా ఉన్నందున తరచు గండ్లు పడుతున్నాయని పలువురు సంఘ సభ్యులు తెలిపారు. వచ్చే సార్వాసీజన్ నాటికి కాల్వ గట్లను పటిష్టం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సమావేశం తీర్మానించింది. చేవూరు పొలిమేరకోడు పంట కాల్వను కూడా తవ్వించాలని సమావేశం కోరింది. 2019లో నిర్వహించిన నీరు -చెట్టు పథకం పనులకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఆయా పనులు నిర్వహించిన వారికి చెల్లించేందుకు కూడా అంగీకరిస్తూ సమావేశం తీర్మానించింది. ఇరిగేషన్, డ్రైనేజీ ఏఈలు సిద్ధార్థ, ప్రసాద్, సంఘ వైస్ చైర్మన్ బొమ్మిశెట్టి వెంకన్న పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

కైకలూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడా ద్వారా నాలుగు దశలుగా పిల్లలకి అందించ వలసిన అంశాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ కృష్ణకుమారి అన్నారు. శుక్ర వారం కైకలూరు 7, 8 వార్డుల్లోకి అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెయ్యి రోజుల్లో పిల్లలను ఏవిధంగా పెంచాలి ? ఏవిధమైన ఆహారం ఇవ్వాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.అంగన్వాడీ టీచర్లు, సీహెచ్ సుగుణ, ఎస్.కవిత, లక్ష్మీ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నానాజీ గురుస్వామికి పరశురామ పురస్కారం

ముదినేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి భక్తులకు శబరిమలై ఎస్ఎస్ఎస్ డివో టినల్ గ్రూప్ ప్రతి ఏటా ఇచ్చే పరశురామ పురస్కార్ ఈ ఏడాది ముదినేపల్లికి చెందిన అయ్యప్ప మాల ధారుడు, గురుస్వామి వేల్పూరి వెంకటేశ్వర రావు (నానాజీ)కి దక్కింది. గురువారం శబరిమ లైలోని ఆంజనేయస్వామి ఆడిటోరియంలో ఎస్ఎస్ఎస్ డివోటినల్ వ్యవస్థాపకుడు శివ నరసింహన్ గురుస్వామి వెంకటేశ్వరరావుకు పురస్కారం అందజేశారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముదినేపల్లి/కైకలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ముదినేపల్లి 33 కేవీ సబ్ స్టేషన్, సింగరాయపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో గుడివాడ డివిజన్ డీఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు, ఆక్వా ఇతర వాణిజ్య సంస్థల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. అలాగే కైకలూరు, కలిదిండి మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మరమ్మతుల నిమిత్తమై కైకలూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ పరి ధిలో సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే కలి దిండి మండలం పోతుమర్రు, కలిదిండి, మూల లంక సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.


చినపాలపర్రు ప్రాథమిక పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న పెదపాలపర్రు హైస్కూలు టీచర్లు

ప్రభుత్వ హైస్కూళ్లకే రండి..

ముదినేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 6 నుంచి పదవ తరగతి చదువులకు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో చేరాలని ముదినేపల్లి మండలంలో ఉపాధ్యాయులు ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు రాజశేఖర్, అష్రఫ్ ఖాన్, నాగమణి, శిరీష తమ హైస్కూలు కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లి శుక్రవారం కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. చినపాలపర్రు, కోడూరు, పెదపాలపర్రు, గురజ, పెనుమల్లి, సంకర్షణపురం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కరపత్రాలను అందజేసి వాటిని తల్లిదండ్రులకు అందజేయాలని తెలిపారు. హైస్కూళ్లలో విద్యాభివృద్ధికి, నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను చినపాలపర్రు ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎం ప్రసన్న కుమారి వివరించారు.


చెరువును తలపిస్తున్న మూల్లంక - పెదలంక రహదారి

అకాల వర్షంతో రహదారి జలమయం

కలిదిండి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం తెల్లవారుజామున అకాల వర్షం కురవటంతో మూల్లంక -పెదలంక ప్రధాన రహదారి జలమయమైంది. రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి పోవడంతో చెరువును తలపిస్తోంది. ఆరు కిలోమీటర్ల మేర గోతులు పడటంతో ద్విచక్ర వాహన దారులు గోతుల్లో పడి గాయపడుతున్నారు.

ప్లేట్లు, గ్లాసులు వితరణ

ముదినేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హనుమార అప్పారావు ప్లేట్లు, గ్లాసులు విరాళంగా ఇచ్చారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణకు 45 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. హెచ్ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్, టీచర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

విజయ దుర్గాదేవికి పూజలు



ముదినేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం దేవపూడి విజయ దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మట్లపూడి వెంకటసాయి సత్యతేజ, సత్యశ్రీ వేణి దంపతులు అమ్మవారికి చీరె సమర్పించి అలంకరణ చేయించారు. దేవస్థానం ధర్మకర్త దాసరి భగవాన్లు ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు.

నేడు వడాలిలో విశ్వేశ్వరస్వామి కల్యాణం

ముదినేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలిలో గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.


చిన్నంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా పూలే జయంతి


చాట్రాయి: చాట్రాయి మండలం చిన్నంపేట, చనుబండ గ్రామాల్లో పూలే చిత్రపటానికి నాయకులు, అధికారులు, కూలీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనంద్, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి, నెక్కలపు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శుభ్రతపై అవగాహన

చాట్రాయి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పోషకాహార పక్షోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లులకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శిశువుల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతపై తల్లులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అంబేడ్కర్ జాతీయ పురస్కారం



మండవల్లి ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండ వల్లి మండలం కానుకొల్లు జడ్పీ ఉన్నత పాఠ శాల ఉపాధ్యాయుడు కురేళ్ల శ్యాంప్రసాద్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. ప్రైవేటు లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఈనెల 13న నిర్వహించే కార్యక్రమంలో అవార్డు అందిస్తున్నట్లు అధ్యక్షుడు నాగయ్య తెలిపారు. శ్యాంప్రసాద్‌ను హెచ్ఎం పవన్‌కుమార్, సర్పంచ్ థామస్, గ్రామపెద్దలు అభినందించారు.